క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఏర్పాటు

బొబ్బిలి: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ మండపం వద్ద పట్టణానికి చెందిన శ్రీమన్నారాయణ నాయీ బ్రాహ్మణ సంఘ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. సంఘ గౌరవాధ్యక్షుడిగా బర్లి అప్పారావు, అధ్యక్షుడిగా బర్లి చిన్నారావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చిలకలపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా సుందరాడ వెంకటపాపారావు, ప్రధాన కార్యదర్శిగా రేజేటి రమేష్, కోశాధికారిగా ఎ.చిన్నారావు ఎంపికయ్యారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనం రుచి చూసి పరిశీలిస్తున్న ఎంఈవో దుర్గారావు

రాజాం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును ఎంఈవో యాగాటి దుర్గారావు మంగళవారం తనిఖీ చేశారు. వంటకాలు రుచికరంగా ఉన్నాయా లేదా మెనూ ప్రకారం భోజనాలు వండిపెట్టారా లేదా చూశారు. రుచి, శుచి కలిగిన భోజనాలు విద్యార్థులకు వండిపెట్టాలని వంట నిర్వాహకులకు ఆయన సూచించారు.

పేకాటశిబిరంపై పోలీసుల దాడులు

రామభద్రపురం: స్థానిక కూరాకుల వీధిలోని ఓ పశువుల శాలలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.28,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వి.ప్రసాదరావు తెలిపారు.

ముగిసిన ఎన్నికల ప్రచారం



రామభద్రపురం: ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడు

రామభద్రపురం/బాడంగి: మండలాల్లో గత కొన్నిరోజులుగా జరుగుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం మంగళవారంతో ముగిసింది. పీఆర్‌టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు ఏపీటీఎఫ్ సభ్యులతో కలిసి రామభద్రపురంలో ప్రచారం నిర్వహించారు. ఈ నెల 27వ తేదీన జరిగే ఎన్నికల్లో తొలి ప్రాధాన్యతా ఓటు తనకు వేసి గెలిపించాలని కోరారు. తాను గెలిస్తే ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తానన్నారు.

శ్రమదానం



బావి పరిసరాలు శుభ్రం చేస్తున్న గ్రామస్తులు

వంగర: మండలంలోని మద్దివలస గ్రామంలోని ప్రజలు మంగళవారం శ్రమదానం చేశారు. ఆ గ్రామ నేలబావి పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం బావిలోని అపరిశుభ్రమైన నీటిని ఇంజిన్ సాయంతో బయటకు తోడించారు. అనంతరం బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. గ్రామస్తుల తాగునీటి సౌకర్యార్థం బావి బాగుచేశామని వారు తెలిపారు.

అభ్యసన సామర్థ్యాల పరిశీలన



విద్యార్థులతో పదాలు చదివిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

రేగిడి: మండలంలోని అంబాడ వెంకటాపురం, పెద్దశిర్లాం ప్రభుత్వ పాఠశాలలను ఎంఈవో ఎంపీ ప్రసాదరావు మంగళవారం సందర్శించారు. తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నలడిగి వారి విద్యాసామర్థ్యాలు పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని, నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం మెనూపై ఆరాతీశారు.

క్షయవ్యాధిపై అవగాహన

వంగర: జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోణంగిపాడు గ్రామంలో క్షయవ్యాధి, దాని నిర్మూలనపై మంగళవారం అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలు, చికిత్స, వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎంఎల్‌హెచ్‌పీ సౌజన్య వివరించారు. అనంతరం వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తామని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు.

సంగమేశ్వరుని దర్శనం..
ముక్తికి మార్గం!

- శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన సంగాం శైవక్షేత్రం
- అలహాబాద్ తరహాలో ఇక్కడి త్రివేణి సంగమం ప్రసిద్ధి
- ఉత్తరాంధ్ర నుంచి పెద్దసంఖ్యలో తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- నేడు మహాశివరాత్రి





వంగర: శివరాత్రి వేడుకలకు ముస్తాబైన సంగమేశ్వరాలయం ఇన్‌సెట్‌లో(బలరాముడు ప్రతిష్ఠించిన శివలింగం)

వంగర: మండలంలోని సంగాం వద్ద ఉన్న పవిత్ర సంగమేశ్వరస్వామి ఆలయం శివరాత్రికి ముస్తాబైంది. ఈ నెల 26 నుంచి మార్చి 4వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నాయి. ద్వాపరయుగంలో బలరాముడు నాగావళి నదీతీరం వెంబడి పాయకపాడు, గుంప, సంగాం, శ్రీకాకుళం, కల్లేపల్లి ప్రాంతాల్లో ఏకకాలంలో ఐదు శివలింగాలను ప్రతిష్ఠించాడు. వాటిలో ఓ శివలింగం సంగాంలో ప్రతిష్ఠించినదని పురాణాలు చెబుతున్నాయి. ఇక్కడి ఆలయ కుడ్యాలపై దేవతామూర్తుల విగ్రహాలు, గోడలపై విష్ణుమూర్తి ప్రతిమలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఇదే పుణ్యక్షేత్రం వద్ద మూడు నదులు(వేగావతి, నాగావళి, సువర్ణముఖి) కలిసే చోటును త్రివేణి సంగమంగా పిలుస్తారు. ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ తరహాలో ఇక్కడి త్రివేణి సంగమం ప్రసిద్ధి. శివరాత్రి రోజున ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు ఇక్కడికి చేరుకుని, పుణ్యస్నానాలు ఆచరిస్తారు. అనంతరం ఇక్కడి 400 ఏళ్లనాటి భారీ మర్రిచెట్టు దగ్గర వంటావార్పు చేసి, పితృదేవతలకు పిండప్రదానం చేస్తారు. ఇక్కడ ఈ విధంగా చేస్తే తమ పితృదేవతల ఆత్మకు శాంతి చేకూరుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. రాజాం-వంగర రోడ్డులో మగ్గూరు జంక్షన్, సంగాం గ్రామం, సంగమేశ్వరస్వామి ఆలయం, గర్భగుడి, త్రివేణి సంగమం వద్ద స్నానాల రేవులు ఏర్పాటు చేసి, అక్కడ గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఇలా వెళ్లాలి..

సంగాం పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులు మొదట రాజాం పట్టణం చేరుకోవాలి. అక్కడి నుంచి వంగర, కొప్పర, రుషింగి గ్రామాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు గానీ ఆటోలు గానీ ఎక్కాలి. రాజాం నుంచి 21 కిలోమీటర్ల దూరంలో ఉన్న మగ్గూరు జంక్షన్ వద్ద దిగితే, అక్కడి నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఆలయం ఉంటుంది. అక్కడి నుంచి విరివిగా ఆటోలు ఉంటాయి. అలాగే పాలకొండ పట్టణం నుంచి ఉంగరాడమెట్ట వరకు వాహన సదుపాయాలు ఉంటాయి.

ఒకేచోట ఐదు ఆలయాలు..

రాజాం: శివరాత్రి పూజలకు స్థానిక పట్టణంలోని అగ్రహారం(కూరాకుల) వీధి ఉమారామలింగేశ్వర స్వామి ఆలయం సిద్ధమైంది. బొబ్బిలి రాజుల కాలంలో బొబ్బిలి వీరుడుగా పేరొందిన తాండ్ర పాపారాయుడు రాజాంలో నివాసం ఉండేవాడని, ఆయన శివభక్తుడు కావడంతో ఆయనే ఇక్కడి శివలింగాన్ని ప్రతిష్ఠించి, ఆలయం నిర్మించినట్లు ప్రతీతి. ఇక్కడి ఆలయంలోని పాలరాతి శివలింగాన్ని దర్శనం చేసుకునేందుకు ఏటా శివరాత్రి రోజున భక్తులు పోటెత్తుతారు. ఇక్కడే పంచముఖేశ్వర శివలింగం కూడా ఉంది. ఆలయ ముందు భాగంలో సుబ్రహ్మణ్యేశ్వరాలయం ఉండగా, ఇక్కడే భక్తులు సర్పదోష నివారణ పూజలు చేస్తుంటారు. ఇదే ఆలయానికి మరోవైపు సంతాకృష్ణుని ఆలయం, ఆ పక్కనే గోశాల ఉంటుంది. ఇక్కడ మాత్రమే శ్రీకృష్ణుడి ఆలయం ఉండడం విశేషం. ఇదే ఆలయం వద్ద కాలభైరవుని మందిరం కూడా ఉంది. నల్లరాతి శిలతో ఉన్న కాలభైరవుడికి అమావాస్య రోజుల్లో భక్తులు పూజిస్తుంటారు. ఇదే ఆలయం దగ్గర సంతోషిమాత గుడి కూడా ఉంది. ఐదు ఆలయాలు ఒకేచోట కలిగిన శివాలయంగా ఉమారామలింగేశ్వరాలయం పేరొందింది. ఇక్కడి పాలరాతి శివలింగాన్ని దర్శించుకుంటే సకల పాపాలు తొలగి, శుభం కలుగుతుందని, అలాగే కాలభైరవుని, పంచముఖేశ్వరుని దర్శించుకుంటే సౌభాగ్యం కూడా సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం.



రాజాంలో బొబ్బిలి రాజుల కాలం నాటి ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం

పురాతన శివాలయం..

మెంటాడ: మహాశివరాత్రి పర్వదినానికి మండలంలోని జయితిలోని భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయం సరికొత్త రూపు సంతరించుకుంది. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా రాష్ట్ర పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఇక్కడి వచ్చి, దైవదర్శనం చేసుకుంటారు. ఇంద్రుడు పుత్రుడైన జయంతుడు యుద్ధానికి వెళ్తూ విజయం చేకూరాలని చెప్పి ఇక్కడి ఆలయాన్ని నిర్మించినట్లు స్థల పురాణాల ద్వారా తెలుస్తోంది. ఇక్కడి ఆలయాన్ని జయంతుడు నిర్మించడం వల్ల గ్రామాన్ని జయంతిగా తొలుత పిలిచేవారు.. ఆ తర్వాత అది జయితి గ్రామంగా పేరొందింది. ఇక్కడి ఆలయం పూర్తిగా రాతితో చేసింది. ఇక్కడే ద్వాదశ జ్యోతిర్లింగాలు ఉన్నాయి. ముఖ్యంగా ఇక్కడి ఆలయం ముందు ఉన్న కోనేరు మధ్యలో ధాన్యముద్రలోని శివుడి విగ్రహం భక్తులను ఆకట్టుకుంటుంది. ఏటా శివరాత్రి ఉత్సవాల సమయంలో భక్తులు పెద్దసంఖ్యలో ఇక్కడి ఆలయాన్ని సందర్శించి, శివుడిని దర్శించుకుంటారు. ఇక్కడే 11వ శతాబ్దం నాటి విఘ్నేశ్వరాలయం కూడా ఉంది.



మెంటాడ: జయితిలో 11వ శతాబ్దం నాటి విఘ్నేశ్వరాలయం

సంగాం జాతరకు పటిష్ట బందోబస్తు



భద్రతా ఏర్పాట్లు వివరిస్తున్న డీఎస్పీ రాఘవులు

వంగర: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా వంగర మండలం, సంగాంలో పవిత్ర సంగమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగే జాతరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు తెలిపారు. మంగళవారం ఆలయాన్ని సందర్శించిన ఆయన అక్కడి పోలీస్ బందోబస్తు, చెక్‌పోస్టు, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయం వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 100 మంది పోలీసులను నియమించామని ఆయన చెప్పారు. ఆయన వెంట రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్రరావు, వంగర, రేగిడి, సంతకవిటి ఎస్‌ఐలు షేక్ శంకర్, పి.నీలావతి, ఆర్.గోపాలరావు తదితరులు ఉన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష

వంగర: మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రం సంగాం సంగమేశ్వరాలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాలకు పక్కాగా ఏర్పాట్లు చేసినట్లు విజయనగరం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష తెలిపారు. భక్తుల దర్శనార్థం ఏర్పాటు చేసిన బారికేడ్లు, త్రివేణి సంగమం వద్ద స్నానాల రేవు ఏర్పాట్లను ఆమె మంగళవారం పరిశీలించారు. అనంతరం సంగమేశ్వరస్వామి సన్నిధిలో ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో పి.శ్యామలరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ బోను ఆనందరావు, ప్రధానార్చకులు సిద్ధాంతం గణపతి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి



బొబ్బిలి: ఎన్నికల సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీవో రామ్మోహనరావు

బొబ్బిలి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆర్డీవో జేవీవీఎస్ రామ్మోహనరావు అన్నారు. స్థానిక పట్టణంలోని ఆయన కార్యాలయంలో ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రి మంగళవారం పంపిణీ చేశారు. ఈ నెల 27వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, మొత్తం ఏడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. బొబ్బిలిలో గొల్లపల్లి వేణుగోపాల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల సిబ్బందికి ఉదయం, మధ్యాహ్నం భోజనం, వసతి కల్పించినట్లు తెలిపారు.



రాజాం సిటీ: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజు

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దారు ఎస్‌కే రాజు మంగళవారం పరిశీలించారు. కేంద్రం వద్ద తాగునీరు, వైద్యసేవలు అందుబాటులో ఉంచనున్నామని, అలాగే పోలీసు బందోబస్తు కూడా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్, ఈడీటీ ప్రకాష్, ఎంఈఓ వై.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సరసనాపల్లి యువత సేవాభావం

రేగిడి: మండలంలోని సరసనాపల్లి గ్రామ వైఎస్సార్ యూత్ సభ్యులు సేవాభావం చాటుకున్నారు. తమ గ్రామం నుంచి ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వంగర మండలంలోని సంగాం గ్రామానికి వేగావతి, సువర్ణముఖి నదుల మీదుగా గ్రావెల్ రోడ్డు నిర్మాణం మంగళవారం చేపట్టారు. ఈ గ్రామం నుంచి ఆయా నదుల మీదుగా కేవలం 500 మీటర్ల దూరంలోనే సంగాం సంగమేశ్వరుని ఆలయం ఉండడంతో నదిలోని తక్కువున్న నీటి ప్రవాహంపై గ్రావెల్‌తో చిన్నపాటి రోడ్డును యువత తమ సొంత డబ్బులతో నిర్మించారు. బుధవారం శివరాత్రి ఉత్సవాలకు సంగాం ఆలయానికి వెళ్లే వారంతా ఈ రోడ్డు ఉపయోగపడుతుందన్న సదుద్దేశంతో రోడ్డు నిర్మించామని వారు తెలిపారు. ఇదే దారిలో వెళ్తే పావుగంట కాలంలో సంగాం చేరుకోవచ్చని లేకుంటే 12 కిలోమీటర్ల దూరం వెళ్లాలని వారు చెబుతున్నారు.



జేసీబీ సాయంతో నదిపై రోడ్డు వేస్తున్న యువత

శిక్షణార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం



తెర్లాం: అంగన్‌వాడీ కార్యకర్తకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎంఈవో త్రినాధరావు

తెర్లాం/రాజాం/రేగిడి: జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా అన్ని మండల కేంద్రాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గత కొన్నిరోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న వృత్తి నైపుణ్య శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిశాయి. మండల విద్యాశాఖాధికారులంతా చివరి రోజు తరగతులను పరిశీలించి, శిక్షణార్థులకు పలు సూచనలు చేశారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతి విషయాన్ని కేంద్రానికి వచ్చే పిల్లల బంగారు భవిష్యత్‌కు ఉపయోగపడేలా చూడాలన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

'పొలం పిలుస్తోంది'

వంగర: మండలంలోని కె.కొత్తవలస గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. భూసార పరీక్షల నిమిత్తం మట్టి నమూనాలు సేకరించారు. సారవంతమైన నేలల్లో నేల సారాన్ని బట్టి పంట వేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో తట్టి కోట కన్నబాబు తెలిపారు.

ఎస్‌డబ్ల్యూపీసీలను వినియోగంలోకి తీసుకురావాలి



సంతకవిటి: మందాకురిటి ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో సురేష్‌కుమార్

సంతకవిటి: మండలంలోని మిర్తివలస, మందాకురిటి గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీసీ(సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్)లను ఎంపీడీవో కె.సురేష్ కుమార్, ఏవో రఘునాథాచారిలు మంగళవారం పరిశీలించారు. కేంద్రాల్లో ఏవైనా మరమ్మతులు చేయాల్సి ఉంటే వెంటనే 15వ ఆర్థికసంఘం నిధులతో బాగుచేసి కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు.

బొబ్బిలిరూరల్: ఎస్‌డబ్ల్యూపీసీల నిర్వహణకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎల్‌పీవో ఎ.మోహనరావు తెలిపారు. ఎస్‌డబ్ల్యూపీసీల్లో చెత్త నుంచి ఎరువు తయారు చేసి దానిని సబ్సిడీపై రైతుకు అందజేసి, పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు. ఇదిలా ఉండగా, మండలంలోని గోపాలరాయుడుపేటలో ఇంటి పన్ను వసూళ్లలో రశీదు ఇవ్వకుండా డబ్బులు వసూలు చేశారన్న ఫిర్యాదుపై డీఎల్‌పీవో మంగళవారం విచారణ చేపట్టారు.

● తవ్వేసి.. వదిలేశారు!



నిత్యం వాహనాల రాకపోకలతో అత్యంత రద్దీగా ఉండే తెర్లాం ప్రధాన రహదారిలోని రెండు గోతులు ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. తాగునీటి పైపులైన్ లీకు అవుతుండడంతో దాని మరమ్మతుల నిమిత్తం ఆ గోతులను కొన్నిరోజుల క్రితం తీసి, ఇప్పటికీ అలానే వదిలేశారు. ఈ గోతులు.. తెర్లాం నుంచి బొబ్బిలి వెళ్లే ప్రధాన రోడ్డు పక్కనే బస్‌స్టేషన్ ఎదురుగా ఉండడంతో ఏ క్షణాన ఏం ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరగకముందే గోతులను పూడ్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

– తెర్లాం

● ఆప్కాస్ రద్దు వ్యతిరేకిస్తూ పోస్ట్‌కార్డు ఉద్యమం



పోస్టుకార్డు ఉద్యమంలో భాగంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం ఏర్పాటైన ఆప్కాస్ రద్దును వ్యతిరేకిస్తూ సీపీఎం, సీఐటీయూ నాయకులు మంగళవారం నిరసనకు దిగారు. బొబ్బిలి పోస్టాఫీస్ వద్ద మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆప్కాస్ రద్దు వద్దు.. ఉద్యోగాల పర్మినెంట్ ముద్దు అని నిరసనకారులు నినాదాలు చేశారు. ఎన్నికల సమయంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని చెప్పి, ఇప్పుడు ఆప్కాస్ రద్దుకు మంత్రి మండలి నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు విమర్శించారు. ఆప్కాస్ రద్దు చేయవద్దని కోరుతూ పోస్టుకార్డు ఉద్యమం చేపడుతున్నామని దీనిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆప్కాస్ రద్దుకు సీఎం చంద్రబాబుకు రాసిన లేఖలను పోస్ట్‌బాక్సుల్లో వేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం తదితరులు పాల్గొన్నారు.

– బొబ్బిలి

● మెనూ చార్జీలు పెంచండి



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల మధ్యాహ్న భోజనం మెనూ చార్జీలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సంఘం జిల్లా అధ్యక్షురాలు డి.రామలక్ష్మిలు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు బొబ్బిలి సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ప్రస్తుతం అప్పులు చేసి మరీ వంట నిర్వాహకులు భోజనాలు వండి పెడుతున్నారని, దీంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒక్కో విద్యార్థికి రూ.20 చొప్పున మెనూ చార్జీ పెంచి ఇవ్వాలని కోరారు. ఇదే డిమాండ్‌తో మార్చి 5వ తేదీన ఎంఈవో కార్యాలయాల వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వై.లలిత, డి.ఆదిలక్ష్మి, ఎల్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

–బొబ్బిలి

ముస్తాబైన ఆలయాలు



రామభద్రపురం: కొత్తరేగ శివాలయం



రామభద్రపురంలో రంగులద్దుకున్న శివాలయం



రేగిడి: శివరాత్రి పూజలకు సిద్ధం చేసిన సంకిలి శివాలయం



బాడంగి ఉమాసోమేశ్వరాలయం

రామభద్రపురం/బాడంగి/తెర్లాం: మహాశివరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. సరికొత్త రంగులద్దుకున్న మందిరాలు, విద్యుత్ అలంకరణలతో ప్రాంగణాలు మెరిసిపోతున్నాయి. బుధవారం నుంచి ప్రారంభం కానున్న శివరాత్రి పూజలకు పెద్దఎత్తున భక్తులు రానుండడంతో ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

నేటినుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

సంతకవిటి: మండలంలోని వాల్తేరు గ్రామంలో ఉన్న మార్కండేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు మూడు రోజుల పాటు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కళింగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గురుగుబెల్లి స్వామినాయుడు మంగళవారం తెలిపారు. ప్రతిరోజూ ఉదయం విశేష పూజలు, మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, సహస్రనామార్చనలు, బిల్వార్చనలు సాయంత్రం లింగాభరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం సీతాస్వయంవరం అనే పౌరాణిక నాటక ప్రదర్శన, గురువారం సీతారామకల్యాణం బుర్రకథ, శుక్రవారం సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శిస్తున్నామన్నారు.

గుర్ల గెడ్డ ప్రాజెక్టుకు రూ.20 కోట్ల నిధులు కేటాయించాలి

మెంటాడ: మండల పరిధిలోని గుర్ల గెడ్డ ప్రాజెక్టు(రిజర్వాయరు) పూర్తి చేసేందుకు రూ.20 కోట్ల నిధులు కేటాయించాలని కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు ఓ ప్రకటనలో మంగళవారం డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో రిజర్వాయరు నిర్మాణానికి నిధులు కేటాయించి, ఇవ్వాలన్నారు. 1998లో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, మట్టి పనులతో పాటు కొంతవరకు కాలువల పనులు చేసి వదిలేశారన్నారు. 2017లో నిర్మాణం పూర్తికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించడం జరిగిందని, ఇదే రిజర్వాయరు పూర్తయితే 1630 ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందుతుందన్నారు. నిర్మాణం ప్రారంభించి, నేటికి 26 ఏళ్లు గడిచినా రిజర్వాయరు పూర్తి కాలేదన్నారు. ఇప్పటికైనా బడ్జెట్‌లో నిధులు కేటాయించి, నిర్మాణ పూర్తికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకుడు తామరాపల్లి సోములు తదితరులు పాల్గొన్నారు.